క్లుప్తంగా

పైపులైన్ లీకేజీకి మరమ్మతులు



పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది

కర్నూలు (టౌన్): నగరంలోని జ్యోతి డిపార్ట్‌మెంటల్ స్టోర్ సమీపంలో పైపులైన్ లీకేజీకి మున్సిపల్ సిబ్బంది గురువారం మరమ్మతులు చేపట్టారు. రెండు రోజులుగా పైప్‌లైన్ నుంచి నీరు లీకేజీ అవుతుండగా స్థానికులు ఫిర్యాదు మేరకు నగరపాలక డీఈఈ మనోహర్ రెడ్డి లీకేజీకి మరమ్మతులు చేయించారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలోని పైపులైన్ లీకేజీకి గురవడంతో ట్రాఫిక్‌కు స్వల్ప అంతరాయం కలిగింది. త్వరితగతిన పనులు పూర్తి చేస్తున్నట్లు డీఈఈ తెలిపారు.

కర్నూలుకు చేరుకున్న కేంద్ర మంత్రి



కేంద్ర మంత్రికి బొకే అందజేస్తున్న జేసీ నవ్య

కర్నూలు/కర్నూలు(సెంట్రల్): జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం వచ్చిన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి గురువారం కర్నూలుకు చేరుకున్నారు. ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకున్న మంత్రికి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. కర్నూలు, నంద్యాల పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, పాణ్యం శాసనసభ సభ్యులు గౌరు చరితారెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్, కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్, గ్రీన్‌కో ప్రాజెక్టు ప్రతినిధులు మంత్రికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. శుక్రవారం ఏరియల్ వ్యూ ద్వారా పిన్నాపురంలోని గ్రీన్‌కో ప్రాజెక్టును పరిశీలిస్తారు. అలాగే అహోబిలంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రాన్ని దర్శించుకోనున్నారు. కాగా, కర్నూలు నగరంలోని మౌర్య ఇన్ హోటల్‌కు చేరుకున్న మంత్రిని జేసీ డాక్టర్ బి.నవ్య మర్యాద పూర్వకంగా కలిశారు.

రేపు జిల్లా స్థాయి చెస్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 19వ తేదీన నంద్యాల జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు డాక్టర్ రవిక్రిష్ణ గురువారం ఓ ప్రకటనలోతెలిపారు. పట్టణంలోని నెరవాటి ఇంగ్లిషు మీడియం పాఠశాలలో 7,9 సంవత్సరాలలోపు బాల, బాలికలు రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొనేందుకు జిల్లా జట్లను ఎంపిక చేస్తున్నట్లు వెల్లడించారు. ఈనెల 18వతేది సాయంత్రం 6గంటలలోపు ఏపీ చెస్‌వెబ్ సైట్‌లో ఎంట్రీలు నమోదు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం 90104 51585 నంబర్లను సంప్రదించాలన్నారు.

మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన భాస్కర డాన్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. గణపతి తాండవం, మహాగణపతిం, శివాష్టకం, శివతాండవం, చిదంబర స్తోత్రం, లింగాష్టకం, అయిగిరినందిని తదితర గీతాలకు, అష్టకాలకు నృత్యప్రదర్శన చేశారు.

పట్టుబడిన బియ్యం పరిశీలన



బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పాణ్యం: తమ్మరాజుపల్లె వద్ద ఉన్న రాఘవేంద్ర ఆగ్రో కిసాన్ ఇండస్ట్రీ రైస్‌మిల్లులో పట్టుబడిన రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయి అధికారులు డైరెక్టర్ మహేష్‌నాయుడు, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఆర్ఐ రామ్, పోలీసులు గురువారం పరిశీలించారు. ఈ మిల్లులో సన్నబియ్యంగా పాలీష్ చేసేందుకు 600కు పైగా బస్తాల రేషన్‌బియ్యాన్ని నిల్వ చేసినట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మిల్లు, బియ్యా న్ని సీజ్ చేసినట్లు సివిల్ సప్లయి డీటీ ప్రసాద్ వెల్లడించారు.

జనాభా లెక్కల ప్రకారం నిధులు మంజూరు చేయండి

కర్నూలు(అర్బన్): ప్రస్తుత జనాభా లెక్కల ప్రకారం ఆర్థిక సంఘం నిధులను స్థానిక సంస్థలకు విడుదల చేయాలని కొత్తపల్లి జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి, డోన్ ఎంపీపీ రేగడి రాజశేఖర్‌రెడ్డి కోరారు. గురువారం వారు ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన జెడ్పీటీసీ, ఎంపీపీల తరుపున తిరుపతిలో జరిగిన 16వ ఆర్థిక సంఘం సమీక్షా సమావేశానికి హాజరయ్యారు. ఈ నేపథ్యంలోనే వారు 16వ ఆర్థిక సంఘం చైర్మన్ డాక్టర్ అరవింద్ పనాగరియను కలిసి ప్రతిపాదనలతో కూడిన వినతి పత్రం అందించారు. సమావేశంలో పీఆర్‌అండ్‌ఆర్‌డీ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, డైరెక్టర్ వీఆర్ కృష్ణతేజ పాల్గొన్నారు.

అక్షర సత్యాలు.. జీవిత నేస్తాలు!

ఎప్పుడు కూలిపోతుందో తెలియని భవనం. నిర్లక్ష్యం గోడలను చీల్చుకొని ఓ చెట్టు మానులా మారుతోంది. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే కలెక్టరేట్‌లోని ఓ మూలన చిన్న గది. ఇక్కడికి సమీపంలోని చిన్నపాటి పార్కులో సేదతీరుతూ, ఆ పక్కనే ఉన్న టీ స్టాల్‌లో వేడినీళ్లను ఆస్వాదించే వారికి.. ఈ గదిలో భారతీయ సంస్కృతి, వారసత్వాన్ని కాపాడుతారనే విషయం ఎవరికో కానీ తెలియదు. స్వయంప్రతిపత్తి కలిగిన ఇంటాక్(ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్) సంస్థ ఇది. ఈ కార్యాలయం గోడకున్న నల్లని బోర్డు తెల్లని అక్షరాలతో 'మనిషికో మాట' శీర్షికన జీవిత సత్యాలను పంచుతోంది. తెలుగుకు చెదలు పడుతున్న రోజుల్లో ముత్యాల్లాంటి అక్షరాలు కళ్లు తిప్పుకోనివ్వకపోవడం ఆశ్చర్యం. ప్రతిరోజూ గోడపై రాతలు మారుతున్నా.. ఈ అక్షర సత్యాలను చదివే ఓపిక లేక ఈ ప్రాంతాన్ని పార్కింగ్ ప్రదేశంగా మార్చేస్తుండటం గమనార్హం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు





అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అగ్నిప్రమాద నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కర్నూలు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా కర్నూలు కలెక్టరేట్ సమీపంలోని ఎ.క్యాంప్ ఇందిరా గాంధీ మెమోరియల్ పాఠశాలలో ఆ శాఖ జిల్లా సహాయ అధికారి చిన్నబజారి ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం మాక్ డ్రిల్ నిర్వహించారు. విద్యాలయాలు, బహుళ అంతస్థుల్లో అగ్నిప్రమాదాలు సంభవిస్తే ఎలా నివారించాలి, లోపల చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలి తదితర విషయాలపై విద్యార్థులకు, బోధన సిబ్బందికి అవగాహన కల్పించారు. యంత్రాల సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చే విధానాన్ని ప్రదర్శించారు. పాఠశాలల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు ఒకరినొకరు తోసుకోకుండా ఒకరివెనుక ఒకరు మెట్ల మార్గం గుండా సురక్షిత ప్రాంతానికి ఎలా చేరుకోవాలో మాక్ డ్రిల్ ప్రదర్శించారు. మెట్ల తలుపుల దగ్గర ఆటంకాలు లేకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే విషయాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. పాఠశాల పరిసరాలను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అగ్నిప్రమాదాలను అరికట్టడానికి సరిపడే నీటిని పాఠశాలలో సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించే సూచనలను ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, అగ్నిమాపక సిబ్బంది రంగస్వామి, వెంకటేశ్వర్లు, మల్లేష్, మహేశ్వర్ నాయుడు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కందుకూరి పురస్కార గ్రహీతలకు సన్మానం



కందుకూరి పురస్కారాల గ్రహీతలను సన్మానిస్తున్న టీజీ వెంకటేష్

కర్నూలు కల్చరల్: జిల్లా స్థాయి కందుకూరి పురస్కారాల గ్రహీతలను మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్ ఘనంగా సన్మానించి అభినందించారు. కందుకూరి వీరేశ లింగం పంతులు జయంతి, తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో జరిగిన వేడుకలో జిల్లా స్థాయి కందుకూరి పురస్కారాలు అందుకున్న జిల్లాకు చెందిన హార్మోనిస్టు ఎర్రమ పాండురంగయ్య, రంగస్థల నటులు జీవీ శ్రీనివాసరెడ్డి, గాండ్ల లక్ష్మన్న, ఎంఆర్ రాధిక, వనారస మంజులను గురువారం తన చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులను నిత్యం ప్రోత్సహిస్తామన్నారు. టీజీవీ కళాక్షేత్రానికి చెందిన కళాకారులకు ఉగాది పురస్కారాలు, కందుకూరి పురస్కారాలు రావడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సభ్యులు రాజారత్నం, కేవీ రమణ, పాల్గొన్నారు.

కళ తప్పిన జాతర

- అరకొరగా వృషభాల క్రయవిక్రయాలు

జూపాడుబంగ్లా: ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా యంత్రాలతో సేద్యం చేయటంతోపాటు అటవీశాఖ అధికారులు కలప విక్రయాలను నిషేధించటంతో రైతన్నలకు పేరొందిన తర్తూరు జాతరలో ఏటేటా కలప, ఎద్దుల విక్రయాలు తగ్గిపోతున్నాయి. ఈ ఏడాది తర్తూరు జాతరకు ఆశించిన స్థాయిలో ఎద్దులు రాకపోవటం.. అరకొరగా వచ్చిన ఎద్దుల ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో కొనుగోలు కోసం వచ్చిన రైతన్నలు నిరాశతో వెనుదిరిగారు. కలప వ్యవసాయ పరికరాలు లభించకపోవటం, ఎద్దుల పోషణభారం అధికం కావటం, గిట్టుబాటు ధరలు లభించకపోవటం వంటి పలు కారణాల వల్ల కొంత మంది రైతులు వ్యవసాయాన్ని వదులుకుంటూ ఎద్దులను విక్రయించటానికి జాతరకు వచ్చినట్లు చెబుతున్నారు. కొత్తగా వ్యవసాయం ప్రారంభించేందుకు ఎద్దులను కొనాలని వచ్చిన వారికి వాటి ధరలు రూ. 80 నుంచి రూ.1.20 లక్షలు పలుకుతుండటంతో అంత ఆర్థిక స్తోమత లేదంటూ వెనుదిరిగారు.



తర్తూరు జాతరలో పలుచగా కనిపిస్తున్న ఎద్దులు

వక్ఫ్ చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాటం

- సేవ్ వక్ఫ్ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన



పాతబస్తీలో కార్నర్ మీటింగ్ నిర్వహిస్తున్న సేవ్ వక్ఫ్ జేఏసీ

కర్నూలు(సెంట్రల్): నూతన వక్ఫ్ చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాడుతామని సేవ్ వక్ఫ్ జేఏసీ నాయకులు అబ్దుల్ దేశాయ్, ఎంఏ హమీద్, టీఎస్ మునీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. గురువారం కర్నూలులో సేవ్ వక్ఫ్ జేఏసీ ఆధ్వర్యంలో రెండు, మూడు వార్డుల పరిధిలో కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. ఈసందర్భంగా ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ డైరెక్షన్‌లో ముస్లింలకు సంబంధించిన మదరసాలు, ఖబరాస్థాన్‌లు, మసీదులు, వక్ఫ్ ఆస్తులను తమ వాళ్లకు కట్టబెట్టుకోవాలని చూస్తున్నారన్నారు. అందులో భాగంగానే వక్ఫ్‌కు సవరణ చేశారని విమర్శించారు. అయితే ఈ చట్ట సవరణ రాజ్యాంగ విరుద్ధమని న్యాయ నిపుణులు అభ్యంతరం తెలుపుతున్నా పట్టించుకోకుండా బీజేపీ, దాని మిత్ర పక్షాలైన టీడీపీ, ఆర్‌జేడీలతో ముందుకెళ్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చట్టాన్ని అమలు చేయకుండా ముస్లింలు వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో షేక్షావలి, చాంద్‌బాషా, షాషావలి, గిరి, ముసా ఇలియాస్, ఫిలాప్, గౌస్‌బాషా, ఖలీల్,మాలిక్ పాల్గొన్నారు.

వారంరోజుల పాటు మే డే వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ అంజిబాబు

కర్నూలు(సెంట్రల్): మేడే వేడుకలను వాడవాడలా వారం రోజుల పాటు ఘనంగా నిర్వహించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు కార్మికులకు సూచించారు. గురువారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మేడే వేడుకలను ప్రతి గ్రామం, ప్రతి వార్డులో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల, పోటీల సందడి మధ్య జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులను ఇవ్వాలన్నారు. కర్నూలు నగరంలో 12 ప్రాంతాల్లో కార్మిక ఉత్సవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, ఆయా సందర్భాల్లో 'మా ఇంటికి మీ స్మార్ట్ మీటర్ వద్దు' అంటూ ప్లకార్డులు, బ్యానర్లను ప్రదర్శించాలని ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు కె.ప్రభాకర్, రఫి, సుధాకరప్ప, హుస్సేన్‌వలి పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉద్యోగాల భర్తీ

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో భర్తీ చేయబోయే ఏవేని ఉద్యోగాల నియామకాలకు సంబంధించి భర్తీ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటిస్తూ ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా మెరిట్ ఆధారంగానే పోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు. ఉద్యోగాలను ఇప్పిస్తామనే దళారుల మాటలను నమ్మి మోసపోవద్దని ఆమె సూచించారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోండి

కర్నూలు(సెంట్రల్): జిల్లాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సీఎస్‌కె.వి జయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గురువారం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై కలెక్టర్లతో చర్చించారు. రాష్ట్రంలో 332 మండలాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉండడంతో 67.34 కోట్లతో నివారణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కరువు ప్రభావిత ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో వడ గాలులు వీచే అవకాశం ఉండడంతో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌కు జేసీ నవ్య, అధికారులు హాజరయ్యారు.

నేడు తుమ్మల రామకృష్ణ సంస్మరణ సభ

కర్నూలు కల్చరల్: కర్నూలు కథా సమయం ఆధ్వర్యంలో దివంగత ప్రముఖ రచయిత, ద్రవిడ యూనివర్సిటీ పూర్వపు వైస్ చాన్స్‌లర్ తుమ్మల రామకృష్ణ సంస్మరణ సభను శుక్రవారం సాయంత్రం 6 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు కథా సమయం కార్యవర్గ సభ్యులు ఉమామహేశ్వర్ తెలిపారు. సాహితీ ప్రియులు, సాహితీ మిత్రులు, తుమ్మల శిష్యులు అందరూ సంస్మరణ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

మైనార్టీలకు డీఎస్సీ ఉచిత శిక్షణ

కల్లూరు: ఏపీ మైనార్టీ శాఖ సహకారంతో స్థానిక బిర్లాగేట్‌లోని శ్రీధర్స్ సీసీఈ కోచింగ్ సెంటర్‌లో మైనార్టీ విద్యార్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒ ప్రకటనలో తెలిపారు. ముస్లింలు, క్రిస్టియన్లు, పార్సీ, సిక్కు విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 74164 49171 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

26న రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు (టౌన్): శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో ఈనెల 26, 27 తేదీల్లో 54వ రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సీ. శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు తమిళనాడులోని అరనిలో జరిగే సౌత్ ఇండియన్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో, అలాగే గుజరాత్‌లోని బుజ్‌లో నిర్వహించనున్న 54వ జాతీయ స్థాయి పురుషుల హ్యాండ్ బాల్ చాంపియన్‌షిప్‌నకు ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో ముందస్తు అడ్మిషన్‌లు నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోవాలని బహుజన విద్యార్థి వేదిక జాతీయ అధ్యక్షుడు బీవీ రమణ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వెంటనే ముందస్తు అడ్మిషన్లను నిర్వహిస్తున్న విద్యా సంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అడ్మిషన్‌లు ప్రారంభమంటూ పెట్టిన ప్రచార ఫ్లెక్సీలను తొలగించాలని కోరారు.

దర్గాల్లో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు



దర్గాల్లో ప్రార్థనాలు చేస్తున్న భక్తులు

హొళగుంద: ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాలను గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకోవడానికి దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి దేవుళ్లకు చాదర్, నైవేద్యాలు సమర్పించారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాలు, షిర్డిసాయిబాబా ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి

- అవగాహన ర్యాలీలో ఎస్పీ విక్రాంత్ పాటిల్



హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీ



ట్రాఫిక్ పోలీసులకు టోపీలు, గ్లూకోజ్ ప్యాకెట్లు అందజేస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించి వాహనాలు నడిపితే 60 శాతం రోడ్డు ప్రమాదాలు తగ్గించవచ్చని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్మెట్ అవగాహన ర్యాలీని కొండారెడ్డి బురుజు వద్ద ఎస్పీ విక్రాంత్ పాటిల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యత కలిగిన దాతల సహకారంతో ట్రాఫిక్ నియంత్రణకు మెడికవర్ హాస్పిటల్, మైపర్ ఫార్మసీ కళాశాల, కెనరా బ్యాంకు వారి సహకారంతో మొత్తం 50 బారికేడ్లను అందజేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. వివిధ కళాశాలల, పాఠశాలలు, బస్టాండ్లు, హాస్పిటల్ ప్రాంతాల్లో ట్రాఫిక్‌పై అవగాహన కల్పించేందుకు 40 పెద్ద స్టిక్కర్లను అతికిస్తున్నట్లు తెలిపారు. వాహనదారులు పాటించాల్సిన నిబంధనలను స్టిక్కర్లలో పొందుపరచినట్లు తెలిపారు. ఎండా కాలంలో ట్రాఫిక్ సిబ్బంది గంటల కొద్ది రోడ్లపై నిలబడి వేడిని తట్టుకుంటూ విధులు నిర్వర్తించాల్సి ఉంటున్నందున సూర్య తాపం నుంచి రక్షణ, ఉపశమనం పొందేందుకు టోపీలు, వాటర్ బాటిళ్లు, గ్లూకోజ్ ప్యాకెట్లను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ వై.మహేశ్వర్‌రెడ్డి, ఖాదర్ బాషా, సతీష్, కెనరా బ్యాంకు రీజనల్ మేనేజర్ సుశాంత్‌లకు ఎస్పీ జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. అడిషనల్ ఎస్పీలు హుసేన్ పీరా, కృష్ణమోహన్, డీఎస్పీలు బాబుప్రసాద్, భాస్కర్‌రావు, ప్రసాద్, సీఐలు మన్సూరుద్దీన్, తేజ మూర్తి, ఆర్ఎస్ఐ హుసేన్, ట్రాఫిక్ పోలీసులు, షోరూమ్‌లో సిబ్బంది, మైపర్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కాటసాని రాంభూపాల్‌రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న నూతనంగా ఎన్నికైన జెడ్పీ కో-ఆప్షన్ సభ్యులు

కల్లూరు: వైఎస్సార్‌సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పని చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు షేక్ ఇలియాస్ ఖాన్ జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలసి కాటసానిని స్వగృహంలో మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా షేక్ ఇలియాస్ ఖాన్ కాటసాని రాంభూపాల్‌రెడ్డిని కలసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఓర్వకల్లు, గూడూరు మండలాల జెడ్పీటీసీలు రంగనాథ్‌గౌడ్, మౌలాలి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆటోలో మరిచిపోయిన బ్యాగ్ అప్పగింత



చీరల బ్యాగును బాధితునికి అందజేస్తున్న కమాండ్ కంట్రోల్ సిబ్బంది

కర్నూలు: ఆటోలో పోగొట్టుకున్న చీరల బ్యాగును వెతికించి కమాండ్ కంట్రోల్ పోలీసులు బాధితుడికి అందజేశారు. తమిళనాడు రాష్ట్రం మధురై జిల్లా శంకర్కోయిల్ గ్రామానికి చెందిన చీరల వ్యాపారి జగదీష్ కర్నూలు మౌర్యా ఇన్ హోటల్ దగ్గర ఆటో ఎక్కి చందన బ్రదర్స్ క్రాస్ సర్కిల్ దగ్గర ఆటో దిగాడు. రూ.12 వేలు విలువ చేస చీరల బ్యాగును ఆటోలో మరిచిపోయాడు. కొద్దిసేపు తర్వాత గుర్తు చేసుకుని రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కొత్తగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ సీఐ శివశంకర్ ఆధ్వర్యంలో పరిశీలించి ఆటోను గుర్తించారు. ఆటో టాప్ నెంబర్‌ను తెలుసుకుని డ్రైవర్ రశీద్‌ను పిలిపించి చీరల బ్యాగును బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా జగదీష్ పోలీసులకు కృతజ్ఞత తెలిపాడు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏఎస్ఐ అస్లామ్, హెడ్ కానిస్టేబుల్ రమేష్ రాయల్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా వాగీశ తీర్థుల ఆరాధన

మంత్రాలయం : మధ్వ పీఠం పూర్వపు పీఠాధిపతి వాగీశ తీర్థుల ఆరాధన వేడుక శాస్త్రోక్తంగా సాగింది. కర్ణాటక రాష్ట్రం గంగావతి తాలూ కా ఆణెగుందిలోని నవబృందావన క్షేత్రంలో వాగీశ తీర్థులు బృందావనస్థులయ్యారు. గురువారం వాగీశ తీర్థుల ఆరాధన పురస్కరించుకుని మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు నేతృత్వంలో ప్రత్యేక పూజోత్సవాలు నిర్వహించారు. ముందుగా వాగీశ తీర్థుల మూల బృందావనానికి నిర్మల్య విసర్జన గావించి పుష్ప, పంచామృతాభిషేకాలు చేపట్టారు. అనంతరం ప్రత్యేక విరులతో విశేషంగా అలంకరించి విశే ష పూజలు జరిపించారు. క్షేత్రంలోనే స్వామిజీ రాములోరి సంస్థాన పూజ కానిచ్చారు.

గిన్నిస్ బుక్‌లో గొందిపర్ల వాసులకు చోటు



ధ్రువపత్రం అందుకుంటున్న దేవదానం కుటుంబ సభ్యులు

కర్నూలు కల్చరల్: కర్నూలు మండల పరిధిలోని గొందిపర్ల గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు కుటుంబ సభ్యులకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కింది. గత సంవత్సరం డిసెంబర్ 1వ తేదీన హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వేదికగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 1090 మంది పాల్గొనగా 1046 మంది ప్రతిభ కనబరిచి లండన్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్‌లో చోటు పొందారు. వీరిలో హెచ్‌పీ దేవదానం, అతని కుమారుడు అరుణ్‌కుమార్, కూతురు స్రవంతి, మనుమడు న్యూటన్ ఐజాక్‌లు ఎలక్ట్రిక్ కీబోర్డుపై 45 సెకండ్లలో మూడు స్వరాలను కనబర్చి లండన్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్‌లో చోటు పొందారు. ఈనెల 14వ తేదీన హైదరాబాదులో సంస్థ ప్రతినిధులు విజేతలకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు.

జీవనోపాధిని మెరుగుపర్చుకోవాలి



పొదుపు మహిళలు ఏర్పాటు చేసిన షాపును ప్రారంభిస్తున్న మెప్మా మేనేజర్ భాస్కర్ రెడ్డి

కర్నూలు (టౌన్): పొదుపు గ్రూపు మహిళలు కొత్తగా యూనిట్లను ఏర్పాటు చేసుకుని జీవనోపాధిని మెరుగుపర్చుకోవాలని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ భాస్కర్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక అజీముద్దీన్ నగర్‌లో తస్లీమా పొదుపు లక్ష్మీ గ్రూపు ఆధ్వర్యంలో తయారు చేసిన డిష్ వాష్ పౌడర్, ఫినాయిల్, సోప్‌లకు సంబంధించిన షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న అన్ని గ్రూపులకు సంబంధిత బ్యాంకుల్లో రూ.20 లక్షల వరకు రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. రుణాలు తీసుకున్న ప్రతి సభ్యురాలు తప్పనిసరిగా యూనిట్‌ను ఏర్పాటు చేసుకుంటే కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మల, స్వరాజ్యం పట్టణ సమాఖ్యా అధ్యక్షురాలు పద్మ గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.